అంగీకరించగలడని ఊహించని కమలకు అతనిది చాలా విశాల హృదయం అనిపించింది. 'ఆఁ ఏముందిలే. తను కూడా సంపాదించి సాయపడ్తోంటే చేదా ఏం ? ఎందరు భర్తలు భార్యలచేత ఉద్యోగాలు చేయించడం లేదూ?' అనుకున్నది.

మొదటి నెల జీతంతో ఏం కొనుక్కోవాలో అనే పథకంతోనే నిద్రలేకుండా గడచిపోయింది ఆ రాత్రంతా.

'ప్రతిదానికీ ఆయన్ని దేవిరించక్కర్లేదు. హాయిగా నా జీతంతో అన్నీ కొనుక్కుంటాను. అనుకున్నది ఉద్యోగంలో ప్రవేశించిన మొదటిరోజు.

ఆఫీస్‌లో అందరూ తనవైపే చూస్తూంటే లోలోపల గర్వం కూడా కలిగింది.

కానీ ఆ గర్వం మర్నాడే నమసిపోయింది. 'నిన్నంటే క్రొత్తగా వచ్చాను. ఈ రోజుకూడా అలా మిక్కీ మిక్కీ చూస్తాడేం ?' అనుకున్నది ఎదుటి సీటులోని జూనియర్ క్లర్కును గురించి.

'స్టుపిడ్, ఎప్పుడూ ఆడమొహాన్నే చూడలేదు కాబోలు. అలా ఎగాదిగా చూస్తాడేం కొండముచ్చు మొహంవీడూ ?' అని లోలోన పళ్ళు నూరుకుంది, పనివున్నా లేకున్నా ఏదో మిషతో వచ్చి పళ్ళికిలించుతూన్న హెడ్ క్లర్కును ఉద్దేశించి.

మొదటి రెండు రోజులూ క్రొత్తబులుపుగా వున్నప్పటికీ, మూడవరోజు అలసట అనిపించింది కమలకు. అటు ఇంట్లో ఆదరా బాదరా వంట చేసుకొని, తయారై ఇటు బస్సుకోసం పరుగెత్తాలి. తన కంటే శివరాం ఆఫీసు ఇంకా దూరం. అందువల్ల అతను ఓ అరగంట ముందుగానే బయల్దేరతాడు. రావడమూ అంతే, ఇద్దరిదీ చెరో టైము.

ఇద్దరిదగ్గరా చెరో తాళంచెవీ వుంటుంది.

ఆఫీసునుండి వచ్చి మరలా సాయంత్రం వంట ముగిచే టప్పటికే నిద్ర వచ్చేస్తూన్నట్టు అన్పిస్తోంది. చిన్న చిన్న పనులలో శివరాం కూడా సాయం చేయడం ప్రారంభించాడు.

వారం తిరిగేసరికే కమలకు 'అబ్బ ఆడవారు ఎందుకు ఉద్యోగాలకోసం ఎగబడతారు ?' అనిపించింది. ఇటు హడా వుడిగా ఇంట్లో వంట, అటు ఆఫీసుకు పరుగెత్తడం మరలా వచ్చి యింటిపని—ఇంతేనా జీవితం ? పూర్తిగా మరమనిషినై పోయాను. సాంఘిక జీవనం అనేది దూరమై పోయింది నాకు?' అనుకున్నది.

శివరాం మనసులో ఏమున్నదో గానీ పైకి మాత్రం అతడే అభిప్రాయమూ వ్యక్తీకరించ లేదు.

ఒకనాడు సాయంత్రం అయిదయ్యేసరికి పనికట్టిపెట్టి, సీటునుండి లేస్తూన్న కమలను గుర్రుగా చూచాడు హెడ్ క్లర్కు.

"ఈ ఆడవాళ్ళతో వచ్చిన చిక్కే-యిది. అయిదయ్యే

నరికి ఆఫీసు వదలి పారిపోవాలంటారు, అవతల బండెడు పని బాకీవున్నా గానీ, ఇలాగైతే ఎలాగ ?" అని విసుక్కోవడం స్పష్టంగా విన్నది.

"పాపం ఇంటి దగ్గర మగాళ్ళూరుకుంటారా మరి ?" అని ఇకిలిస్తోంది మరో మగకంఠం. అతడు సీనియర్ డ్రాఫ్ట్సమన్.

"ఆఁ ఊరుకోక ఉరెట్టుకుంటారా ? మరీ అంత అనుమానించేవాళ్ళు తగుదునమ్మా అంటూ ఉద్యోగాల కెందుకు పంపుతారో పెళ్ళాల్ని? ఇంట్లో దాచుకోరాదూ?"

ఆ తర్వాత ఇద్దరి వికవికలూ వినవచ్చాయి.

కమల ఇంటికి వెళ్ళడం మానుకుని, హెడ్‌క్లర్కు సీటువైపు నడిచింది.

"ఈరోజే ముఖ్యంగా చేయవలసిన పని ఏమైనా వున్నదాండీ ?" అనడిగింది.

"అబ్బె...అబ్బె..."నసిగాడు హెడ్‌క్లర్కు.

"వుంటే చెప్పండి. అవేవో పూర్తిగా టైపు చేసే వెళ్తాను. ఇంటి దగ్గర అంతగా సంజాయిషీ అడిగి నిలవేసే కుసంస్కారు లెవరూ లేరు."

దిమ్మెరబోయిన హెడ్‌క్లర్కు కొంచెం సర్దుకున్నాడు. "ఆఁ ఇవిగో...ఈ రెండూ కూడా చేసేస్తే, రేపు ప్రొద్దున్నే ఆఫీసర్‌గారి చేత సంతకం చేయించేసి పోస్టులో పంపేద్దామని"

మాట్లాడకుండా అవి తీసుకుని ఆ పనికూడా పూర్తి చేసింది కమల.

ఆమెకు మనసులో పీకుతూనే వున్నది. శివరాం ఇంటికి వచ్చేస్తాడీపాటికి. తానే స్వంతంగా కాఫీ చేసుకుంటూ అవస్థపడుతుంటాడు పాపం.

'కానీయ్ మరి. ఈ ఒక్కరోజుకే కదా.' సరిపెట్టుకున్నది.

కాగితాలు హెడ్‌క్లర్క్‌కు అందిస్తూ అన్నది: "ఏదైనా పని వుంటే స్పష్టంగా చెప్పేయండి. డొంకతిరుగుళ్లూ, వాళ్ళతో వీళ్ళతో అనడాలూ అక్కర్లేదు. మామూలు టైమైపోయిందికదా అని వెళ్ళబోయానే గానీ అర్జంట్ వర్క్ వదలి ఎప్పుడూ వెళ్ళను. నౌఖరీ చేయడానికేగా వచ్చాను?"

"అబ్బో ! చాలా ముక్కుసూటి వ్యవహారమే ! ఇంత నిక్కచ్చి రకాలు ఉద్యోగాలు చేయలేవని తెలియదు కాబోలు పాపం. ఇంకా క్రొత్తకదూ ?"

అంతా చూస్తూన్న మరో శాస్త్రీ అలా దాగి సకిలించడం కమల విన్నది.

'ఇదీ' అని స్పష్టీకరించలేని బాధా జుగుప్స కలిగాయి ఆమె మనస్సులో.

బస్సులన్నీ నిండుగా క్రిక్కిరిసిన జనంతో పరుగిడు తున్నాయి. నిలబడీ నిలబడీ చాలా అలసట అనిపించింది.

ఆఖరుకు చీకటిపడుతూండగా వచ్చిన బస్సులో జాగా దొరికింది.

అందరికీ హడావుడే. ఎవరిమట్టుకు వారే పరుగెత్తి త్రోసుకుంటూ ఎక్కడమే. ఆ త్రోపులాటలో ఫుట్‌బోర్డు నుండి క్రిందపడబోయిన కమలను బస్‌లో ముందే ఎక్కి నిలబడిన ఒక వ్యక్తి చేయిపట్టి పైకిలాగి రక్షించాడు.

అతడు మంచివాడు గనుకనే ఆ మాత్రం ఆసరా యిచ్చాడు.

అయినా కమలకు చీకాకన్పించింది. ఆ చేయి అక్కడకు కాల్చి పారేసుకోవాలనేంత దుగ్ధతో మండిపోయింది మనసు.

ఒక యువకుడెవరో తాను కూర్చున్న చోటునుండి లేచి కమలకు నిలబడే బాధ తప్పించాడు. 'థ్యాంక్స్' చెప్పి కూర్చున్నది బ్రతుకు జీవుడా అనుకుంటూ.

ఇటువంటి సమయాలలో సమాన హక్కులు సరిగా గుర్తుండవు !

ఇల్లు చేరేసరికి శివరాం ముఖంలో ఆదుర్దా మాయమై సంతోషం కన్పించింది :

"హమయ్య. వచ్చావా? ఇంకో పదినిముషాలు చూసి నేనే వద్దామనుకుంటున్నాను." అన్నాడు కాఫీ గ్లాసు అందిస్తూ.

అపరాధం చేసిన దానిలా లోలోపల బాధపడింది కమల కాఫీ అందుకుంటూ.

వచ్చీరాని పాకశాస్త్రంతో అవస్థపడుతున్నాడు శివరాం. "చూడు, అన్నం బాగా వుడికిందా ? చారు ఏమిటో మరీ నీళ్ళులా లేదూ ?"

నవ్వూ ఏడుపూ సమపాళ్ళలో వచ్చాయి కమలకు. "నే చేస్తాగా యిక మీరు వెళ్ళి స్నానం చేయండి" అన్నది. పనిలో జోరబడుతూ.

భోజనాల దగ్గర క్లుప్తంగా చెప్పింది ఆ రోజు ఆఫీస్‌లో జరిగిన సంగతి.

శివరాం ఏమీ వ్యాఖ్యానించలేదు. మౌనంగా విని ఊరుకున్నాడు. కానీ ఆ రాత్రి కమల సుఖంగా నిద్ర పోలేక పోయింది. హెడ్‌క్లర్క్ వాచాలతా, డ్రాఫ్ట్సమన్ వికవికలూ, మరొకడి వెకిలి చూపులూ, బస్‌వద్ద సంఘటనా అన్నీ ఒక్కొక్కటిగా మరల మరల గుర్తుకురాసాగాయి.

భర్త తనమాట కాదంటే అభిమానం పొడుచుకొచ్చేది. తానడిగినది వద్దంటే అవమానం జరిగినట్లే బాధ పడేది; మాటకు మాట రెట్టించేది.

మరి నేడు పరాయి ప్రేలాపన వినికూడ నోరు మూసుకు సహించవలసి వచ్చింది.

*　　*　　*

నెల జీతం అందుకున్న ఆనందం కనిపించలేదు కమల ముఖంలో.

"అలా వున్నావేం! ఒంట్లో బాగాలేదా ?" అన్నాడు శివరాం.

"ఆఁ శుభ్రంగా వున్నాను... ఇదిగో ఈరోజు జీతం అందింది." బాగ్‌లోనుంచి తీసి అతని కందీయబోయింది.

శివరాం అందుకోలేదు. "ఉంచు. పద బజారు వెళ్దాం. తయారవ్వు" అన్నాడు.

"ఎందుకూ?"

"పట్టుచీర కొనుక్కుందువుగాని దానితో."

"వద్దులెండి, రానూ పోనూ బస్సు ఖర్చులూ, అక్కడ మధ్యాహ్నం కేంటిన్ ఖర్చులూ పోను మిగిలిన దెంతా?"

"అంతలో వచ్చినదే కొనుక్కో పద."

"వద్దు. సేవింగ్సులో వేద్దాం" అన్నది.

ఆశ్చర్యంగా చూచాడు శివరాం.

అతను ఏమని అడగకుండానే తానే వివరించింది కమల. "ఎంత శ్రమపడితే న్యాయంగా డబ్బు సంపాదించగలమో స్వానుభవం తెలియజెప్పింది. 'అది లేదు—ఇది లేదు' అని మీ మీద చిరబురలాడేనాడు బయట అలసివచ్చే మీ కష్టాన్ని గుర్తించలేక పోయేదాన్ని. అంతేకాదు-ఈ ఆర్థికలబ్ధివలన నేను చక్కటి గృహవాతావరణానికి సరస సౌకుమార్య జీవనానికి దూరమవుతున్నానని గ్రహించగలిగాను. అందుకే ఉద్యోగం వదులుకున్నాను.

అంతా చిరునవ్వుతో విన్నాడు శివరాం. జేబులో నుండి డబ్బుతీసి అందిస్తూ "ఇదిగో నా జీతం. నీకు డబ్బు విలువా, శ్రమవిలువా తెలిసివచ్చింది గనుక నాకిక నిశ్చింత. గృహ నిర్వహణ భారమంతా నీదేయిక. సంపాదించడం మాత్రమే నా వంతు" అన్నాడు.

ఆనందంతో మెరిసే కళ్ళతో ఆ డబ్బును అందుకుంది కమల. "చూడండి ఎంత చక్కగా పొదుపు చేస్తానో! నెలకు కనీసం రెండు వందలైనా మిగుల్చుతాను. మిగిలిన దాంతోనే ఇల్లు గడుపుతాను."

"నీ ఇష్టమన్నానుగా! పట్టుచీరలే కొంటావో-రానున్న పసివాళ్ళకొరకై ఆదాచేస్తావో అంతా నువ్వే నిర్ణయించుకొని ఖర్చుచేయి."

"ఆదా చేస్తాను, అనవసర ఖర్చులు చేయను. ఎప్పుడూ 'అప్పు' అనేది వద్దు మనకు" స్థిరంగా అన్నది.

"గుడ్ గర్ల్? ప్రతి స్త్రీ కూడా అత్యాశలకూ అనవసర డాంబికాలకూ ఎగబడక వున్నదానితో తృప్తిపడుతూ రాబడిలోనే ఖర్చును పరిమితం చేసుకొంటే ప్రతి గృహమూ ఆనందనిలయం కాదూ?"

"నిజమే." తల వాల్చుకుని మెల్లగా అన్నది కమల. "ఇకనుంచి మన యింట్లో పోట్లాటలు వుండవు. సంపాదిస్తున్నాం కదా అని మగవారు అధికారంగా ప్రవర్తిస్తారని అపోహ పడేదానినేకానీ, పదిమందిలో తిరిగి నెగ్గుకురావలసిన మీ

చీకాకులూ, ఇబ్బందులూ మాత్రం యిప్పుడే తెలుసుకున్నాను. ఈ యదార్థం తెలుసుకోవలసిన కర్తవ్యం ప్రతి స్త్రీకి వున్నది."

"హాయిగా యింట్లో కూర్చుని, ఎదురు నీల్గుతారు ఈ ఆడవాళ్ళు అనుకొనేవాడిని. నీవు ఆలస్యంగా ఆఫీసునుండి వచ్చిన రోజల్లా వంటపనీ యింటిపనీ ఎంత కఠినమైనవో నేనూ అర్థం చేసుకున్నాను?"

ఇద్దరూ హాయిగా తేలికగా నవ్వేసుకున్నారు.